ఎన్నికల పోరుకు సమాయత్తం కావాలి

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: రానున్న ఎన్నికల పోరుకు ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయిలో సమాయత్తం కావాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో బుధవారం కనిగిరి, పీసీపల్లి మండలాలకు చెందిన గుడిపాడు, పెద అలవలపాడు, గుదేవారిపాలెం, చౌత గోగులపల్లి పంచాయతీలకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగు పంచాయతీల్లో 8 బూతుల్లో ప్రణాళికాబద్ధంగా ఎన్నికలు జరుపుకునేందుకు సమగ్ర నివేదికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రతి పంచాయతీలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేలా పకడ్బందీ ప్రణాళికతో ఉండాలన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుర్రా కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెరుకూరి సతీష్ చౌదరి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, సర్పంచ్ నాగేంద్ర, రెగుల బాలయ్య, రవి, నజీర్, పీసీపల్లి మండల కోఅప్షన్ సభ్యుడు ఎస్కే సలీం బాష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాకల సర్పంచ్ అభ్యర్థిగా కొక్కిలిగడ్డ స్వాములమ్మ

● వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రకటన


వైఎస్సార్ సీపీ బీఎల్‌ఏలకు సూచనలిస్తున్న వరికూటి

సింగరాయకొండ: పాకల సర్పంచ్ పదవికి జరగనున్న ఉప ఎన్నికకు వైఎస్సార్ సీపీ మద్దతుదారు, మాజీ సర్పంచ్ కొక్కిలిగడ్డ రోశయ్య భార్య స్వాములమ్మ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రకటించారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బీఎల్వోల ఓటరు సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. ఒక కుటుంబానికి చెందిన వారి ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో నమోదై ఉంటే ప్రస్తుతం వారందరినీ ఒక పోలింగ్ బూత్ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. దొంగ ఓట్లు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పాకల సర్పంచ్ ఉప ఎన్నికకు మాజీ సర్పంచ్ రోశయ్య కుటుంబ సభ్యులకే అవకాశం ఇచ్చామని, అదే మంచి సంప్రదాయమన్నారు. వార్డు మెంబర్లుగా ఎవరు పోటీలో ఉండాలనేది సర్పంచ్ అభ్యర్థులే నిర్ణయించుకుంటారన్నారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ ముల్లపూడి సత్యన్నారాయణ, కుమార్, షేక్ కరీం, ల్యాబ్ ప్రసాద్, సాయికోటి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు రెవెన్యూ మంత్రి ధర్మాన రాక

ఉలవపాడు: మండల పరిధిలోని బద్దిపూడి గ్రామానికి ఈ నెల 11న రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వస్తున్నట్లు కేవీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కూనం రాఘవరెడ్డి తెలిపారు. 10వ తేదీ ఆత్మకూరు నుంచి రోడ్డు మార్గం ద్వారా బద్దిపూడి గ్రామానికి వచ్చి రాత్రి 7 గంటలకు రాఘవరెడ్డి గృహంలో రాత్రి బస చేస్తారు. 11 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వరకు అక్కడే ప్రజలకు అందుబాటులో ఉంటారు. 3 గంటల తరువాత విజయవాడకు బయలుదేరుతారని ఆయన తెలిపారు.

నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ సొమ్ము విడుదల

జరుగుమల్లి: పొదుపు మహిళల బ్యాంకు ఖాతాల్లో వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత నగదును గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నట్లు ఏపీఎం భాగ్యలక్ష్మి తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న మహిళా గ్రూపులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. జరుగుమల్లి మండలంలోని 1084 గ్రూపులకు సున్నా వడ్డీ సొమ్ము రూ.1,31,52,731 నగదు అందించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కొండపి మండలంలో కలెక్టర్ పర్యటన

కొండపి: కొండపి మండలంలో గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్ పర్యటిస్తున్నట్లు తహసీల్దార్ పి.నర్సింగరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంగటలకు ముప్పవరం హైస్కూల్లో అసెట్స్ పంపిణీ, 11 గంటలకు పెరిదేపి ఎలిమెంటరీ స్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ, ఉపాధ్యాయుల సన్మానం అనంతరం ఉప్పలపాడు నుంచి ఏ గ్రామములోనైనా ఆకస్మిక తనిఖీ ఉంటుందని వివరించారు. అధికారులు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా బూత్ లెవెల్ అధికారుల ఇంటింటి సర్వేను కలెక్టర్ తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఉలవపాడు: మండల పరిధిలోని పెదపట్టపుపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

పాకల సర్పంచ్ పదవికి ఒక నామినేషన్

సింగరాయకొండ: మండలంలో ఒక సర్పంచ్, రెండు వార్డు మెంబర్ స్థానాల ఉప ఎన్నికకు ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విషయం తెలిసిందే. బుధవారం పాకల సర్పంచ్ పదవికి టీడీపీ మద్దతుదారుడు పాకల శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారని ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. ఈనెల 10వ తేదీ గురువారంతో నామినేషన్ల గడువు ముగుస్తుందని పేర్కొన్నారు.

పంటలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏడీఏ

కనిగిరి రూరల్: పంటల సాగుపై సమగ్ర అవగాహన కల్గి ఉండాలని ఏడీఏ వెంకట రమణ అన్నారు. స్థానిక అగ్రీ ల్యాబ్‌లో బుధవారం వ్యవసాయ సిబ్బందికి జరిగిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విత్తనాలకు సంబంధించి మొలకెత్తడం, తేమ శాతం, ఎరువులకు సంబంధించిన నాణ్యత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి శిల్ప, వ్యవసాయ విస్తరణ అధికారి ఆయేషా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ముత్యాల పరమేశ్వరి ఆలయ పనులు


నిర్మాణంలో ఉన్న ముత్యాలమ్మ పరమేశ్వరి ఆలయం

మద్దిపూడి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కొలువై ఉన్న ముత్యాల పరమేశ్వరి ఆలయ పునఃనిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దాదాపు 400 ఏళ్ల నాటి ఆలయం జీర్ణావస్థకు చేరడంతో అదే స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు నాంది పలికారు. దాతల సహకారంతో దాదాపు రూ.60 లక్షల అంచనా వ్యయంతో పూర్తిగా రాతితో ఆలయాన్ని పునఃనిర్మిస్తున్నారు. మద్దిలేటిరెడ్డి శిల్పకళా బృంద సభ్యులు ఇప్పటి వరకు గర్భగుడి, మండపం పనులతో పాటు ఆలయం ఎదుట పోతురాజు విగ్రహం ప్రతిష్ఠించేందుకు గ్రానైట్ రాళ్లతో దిమ్మె ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ముత్యాలమ్మ పరమేశ్వరి అమ్మవారి గోపుర నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయని, ప్రహరీ నిర్మించి అమ్మవారి శిల్పాలు చెక్కాల్సి ఉందని కార్యనిర్వాహకులు తెలిపారు.

పోలీస్ బందోబస్తుతో టమోటాల అమ్మకం


పోలీస్ పహారాలో టమోటాల పంపిణీ

కందుకూరు : మండిపోతున్న టమోటా ధరలతో ప్రభుత్వం సరఫరా సబ్సిడీ టమోటాల కోసం ప్రజలు ఎగబడుతున్నారు. రైతుబజార్ లోపల నుంచి బయట వరకు భారీ క్యూలు కట్టారు. దీంతో పరిస్థితి గందరగోళంగా మారడంతో ప్రత్యేకంగా ఒక ఎస్సైని, కొందరు కానిస్టేబుల్‌లను అక్కడ నియమించి టమోటాలు పంపిణీ చేయాల్సి వచ్చింది. టమోటాలకు భారీ డిమాండ్ ఉండడంతో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మార్కెటింగ్‌శాఖ అధికారులతో చర్చలు జరిపి 5 టన్నుల టమోటాలను కందుకూరుకు కేటాయించే విధంగా ఒప్పించారు. దీంతో టమోటాల కోసం వచ్చిన ప్రతి ఒక్కరికి టమోటాలు ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేయాలి


శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాదరావు

ఉలవపాడు: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈఓ ప్రసాదరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరిగిన ఒకరోజు ఉపాధ్యాయుల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ పొందిన ఉపాధ్యాయులు రేపటి నుంచి వారు పాఠశాలలో చెప్పిన విషయాలను అమలుచేయాలన్నారు. గతంలో బదిలీ కారణాల వల్ల హాజరు కాలేకపోయిన వారికి ఈ శిక్షణ నిర్వహించారు. పాఠశాలలో డ్రాపౌట్లను గుర్తించాలన్నారు. బోధనా పద్ధతులు మెరుగుపరుచుకోవడానికి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలియచేశారు. శిక్షణ కార్యక్రమ ఆర్పీలు రమేష్, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి ఉన్న బస్సులన్నీ బస్టాండ్‌కు..


ఆర్టీసీ బస్సులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సింగరాయకొండ: స్థానిక బస్టాండ్‌కు అనుమతి ఉన్న ప్రతి బస్సు రావాల్సిందేనని ఆర్టీసీ విజిలెన్స్ స్పెషల్ స్క్వాడ్ సిబ్బంది స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ బత్తుల సుప్రజరెడ్డి సూచనలతో ఒంగోలు ఆర్ఎం సుధాకర్‌బాబు ఆదేశాల మేరకు బుధవారం ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు జాతీయ రహదారిపై ఇతర డిపోల బస్సులను తనిఖీ చేశారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ.. సింగరాయకొండ బస్టాండ్‌కు చార్ట్‌లో పేర్కొన్న ప్రతి బస్సు వెళ్లాలన్నదే తమ ఉద్దేశమన్నారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో రెండు రోజులుగా రాత్రీపగలు తేడా లేకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అనుమతి ఉండి కూడా బస్టాండ్‌కు బస్సులను తీసుకెళ్లని డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జవాబుదారీతనంగా పనిచేయాలి

● చైర్మన్ అబ్దుల్ గఫార్


సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 8వ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్‌గఫార్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే అర్జీలపై సకాలంలో స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అర్జీదారున్ని ఆప్యాయంగా పలకరించి సమస్యను తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందచేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపర చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యం


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రేష్మి

జరుగుమల్లి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటింటికీ మెరుగైన వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ రేష్మి తెలిపారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా 73 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలతోపాటు సుగర్ బాధితులకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మెర్సీ, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశా పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు విధిగా వైద్య పరీక్షలు

● డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

సింగరాయకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి విధిగా వైద్య పరీక్షలు చేయాలని డీఎంహెచ్‌ఓ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని, గ్రామ సచివాలయం-3 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతోపాటు జ్వరపీడితులను గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామ సచివాలయం-3లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ చైతన్యకృష్ణ, డాక్టర్ ఉజ్వల, డాక్టర్ వంశీధర్, డాక్టర్ ధీరేంధర్ పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డి.ప్రకాశం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న లే అవుట్లలోని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చైతన్యవంతులను చేయాలన్నారు. లే అవుట్ల వారిగా గృహ నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది


మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, సర్పంచ్ ఓబులుకొండయ్య


పీసీపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, జెడ్పీటీసీ

పీసీపల్లి: దేశ స్వాతంత్ర్యం కోసం అమరవీరులు చేసిన త్యాగం మరువలేనిదని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం నాభూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాదీ కా అమృతోత్సవంలో భాగంగా దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన వీరుల త్యాగాలకు గుర్తుగా మొక్కలు నాటడం, శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం, ఏపీఓ రాంబాబు, ఎంపీటీసీ చెరుకూరి ప్రసన్న, సత్యనారాయణ, కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వలేటివారిపాలెం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తి చేసిన సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వలేటివారిపాలెం, పోలినేనిచెరువు, అమ్మపాలెం, నేకూనాంపురం, బడేవారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌ల అధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అమ్మపాలెంలో మాట్లాడుతూ నా భూమి నా దేశం నేల తల్లికి వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం శిలాఫలకాలు ఏర్పాటు చేసి పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటారు.

మృతుని కుటుంబసభ్యులకు కదిరి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

సీఎస్‌పురం (పామూరు): పామూరు హర్షిణి ఫొటో స్టూడియో యజమాని మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సందర్భంగా పామూరు, సీఎస్‌పురం మండలాల ఫొటోస్టూడియో అసోసియేషన్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బాబూరావును కోరారు. ఈ సందర్భంగా బుధవారం శీలంవారిపల్లెలోని ఆయన నివాసంలో మృతుడు మహేష్ కుటుంబసభ్యులకు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు రూ.15 వేల ఆర్థికసాయం చేశారు. ఈసందర్భంగా ఆయనకు సంఘం సభ్యులు, మృతుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుత్తి మాధవ, యగటీల నాగార్జున, ఇర్ల తిరుమల, శంకర్, రసూల్, ఎలికా శ్రీను పలువురు పాల్గొన్నారు.

కోవిలంపాడు వార్డుకు నామినేషన్ దాఖలు


నామినేషన్ అందజేస్తున్న పరిమళ

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని కోవిలంపాడు పంచాయతీ 2వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం ఒక్క నామినేషన్ వచ్చినట్లు ఎన్నికల అధికారి షరీఫ్ తెలిపారు. ఈసందర్భంగా మిట్టపాలెంకు చెందిన రాచపూడి పరిమళ తన నామినేషన్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల అధికారికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, గోను చంద్రశేఖర్‌రెడ్డి, మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బజాజ్‌బుజ్జి, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, షేక్.ఖాదర్‌బాషా, కే.అంకయ్య, యస్.రాజారత్నం, రాచపూడి దానియేలు, బి.ప్రభాకర్, సూరిపోగు సుదర్శనం, రాచపూడి దేవ, ఏలియ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏఈపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు: ప్రజల అభ్యంతరాలు, సబ్‌కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా ఇళ్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం చేపట్టిన విద్యుత్‌శాఖ ఏఈపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలోని వెంకటేశ్వరనగర్‌లో ఇళ్ల మధ్య చేపట్టిన ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణాన్ని ఆపాలని స్పందనలో సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణాన్ని ఆపాలని ఆమె ఆదేశించినా ఏఈ పట్టించుకోకుండా నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. ప్రైవేట్ స్థలంలో చేపట్టిన నిర్మానం గురించి స్థానికుల చెప్పాల్సిన అవసరం లేదని ఏఈ చెప్పడం సరైన విధానం కాదన్నారు. ఏఈపై విద్యుత్ సీఎండీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు, సహాయ కార్యదర్శి పి. బాలకోటయ్య పేర్కొన్నారు.

15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల

హనుమంతునిపాడు: మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.49.58 లక్షలు విడుదలైనట్లు ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తెలిపారు. నిధులు ఆయా సర్పంచుల బ్యాంకు ఖాతాలో జమయ్యాయని పేర్కొన్నారు.

పౌష్టికాహారం ఆరోగ్యదాయకం


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న నేతలు

పామూరు: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎంతో ఆరోగ్యదాయకమని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ అన్నారు. స్థానిక 3వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులకు వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లను పంపిణీచేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతలకు, పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. పార్టీ ప్రచార కమిటీ మండల అధ్యక్షుడు నీరుకట్టు నాయబ్‌రసూల్, ఆవుల నారాయణ, మహిళాపోలీస్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మిరాజ్యం పాల్గొన్నారు.

పథకాలను పారదర్శకంగా అమలు చేయాలి

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో అర్హులందరికీ అందచేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో బుధవారం ఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సున్నా వడ్డీ, జగనన్న తోడు, పీఎం స్వానిధి, చేయూత, వంటి పథకాలను పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆర్పీలపై ఉందన్నారు. ఆర్పీలు ప్రభుత్వానికి, మహిళా సంఘాలకు వారధిల్లా పనిచేసి మహిళలకు పథకాలను సకాలంలో అందచేయాలన్నారు. ఆర్పీలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. సమావేశంలో మెప్మా టీఎంసీ రఘు, సీఓ సురత్న, సీఎంఎల్ ఆర్‌పి.దీప్తి, పట్టణ సమాఖ్య ఆర్పీ హనీఫా, ఆర్పీలు పాల్గొన్నారు.